పరిగి : కేక్ కట్ చేస్తున్న జూనియర్ సివిల్ జడ్జి నాగుల శిల్ప

తాండూరు: ఆస్పత్రిలో కేక్ కట్‌చేస్తున్న వైద్యులు, సిబ్బంది

తాండూరు: మహిళ పోలీస్‌లను సన్మానిస్తున్న డీఎస్పీ బాలకృష్ణారెడ్డి

ఆమెకేదీ సాటి.. అన్నింటా మేటి

- పరిగి జూనియర్ సివిల్ జడ్జి నాగుల శిల్ప
- వికారాబాద్ జిల్లాలో ఘనంగా మహిళా దినోత్సవం
- ఉద్యోగులు, సిబ్బందిని సన్మానించిన అధికారులు

పరిగి : పోలీస్ స్టేషన్‌లో మహిళా కానిస్టేబుళ్లను సన్మానించిన పోలీసు అధికారులు

బొంరాస్‌పేట : మహిళలను సన్మానిస్తున్న నాయకులు

పరిగి, మార్చి 8 : మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని పరిగి జూనియర్ సివిల్ జడ్జి నాగుల శిల్ప అన్నారు. కుటుంబ బాధ్యతలు నెరవేరుస్తూనే, వృత్తి ఉద్యోగాల్లోనూ ప్రతిభను కనబరుస్తున్నారని కొనియాడారు. శనివారం పరిగిలోని కోర్టు ఆవరణలో మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సివిల్ జడ్జి మాట్లాడుతూ.. సరికొత్త విభిన్నమైన రంగాల్లో బాధ్యతలు చేపట్టేందుకు సిద్ధమవుతున్నారని తెలిపారు. సవాళ్లతో కూడుకున్న విధుల నిర్వహణలో సమర్థంగా పని చేస్తూ శభాష్ అనిపించుకుంటున్నారని తెలిపారు. మహిళలు నేర్చుకోవడం నిరంతర ప్రక్రియ అని తెలిపారు. ఏ వయసులోనైనా చదువుకోవచ్చనని అన్నారు. వివాహమైన తర్వాత తాను ఎల్ఎల్‌బీ చదివానని పేర్కొన్నారు. మహిళలు నైపుణ్యాలను మరింత మెరుగుపరుచుకోవాలన్నారు. ఈ సందర్భంగా మహిళలతో కలిసి కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో కార్యక్రమంలో డీఎస్పీ శ్రీనివాస్, సీఐ శ్రీనివాస్‌రెడ్డి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాస్‌యాదవ్, ఏజీపీ బాలముకుందం, ఎస్సై సంతోశ్‌కుమార్, న్యాయవాదులు ఆనంద్ గౌడ్, వెంకట్‌రాములు, గౌస్‌పాషా, అందె విజయకుమార్, రాముయాదవ్, ఇబ్రహీంఖాన్ తదితరులు పాల్గొన్నారు. పరిగి పోలీస్‌స్టేషన్‌లో మహిళా కానిస్టేబుళ్లను సన్మానించారు. అనంతరం వారు కేక్ కట్ చేశారు.

అన్ని రంగాల్లో ముందుండాలి

తాండూరు : అంతర్జాతీయ మహిళ దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం తాండూరు నియోజకవర్గంలోని తాండూరు పట్టణం, తాండూరు, యాలాల, బషీరాబాద్, పెద్దేముల్ మండలాల్లో మహిళలు కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు. స్వచ్ఛంద సంస్థలు, పోలీస్ శాఖ, విద్యా, వైద్య సంస్థల ఆధ్వర్యంలో మహిళ సిబ్బంది, ఉద్యోగులను సన్మానించారు. తాండూరు మున్సిపాలిటీ, మార్కెట్ కమిటీ, ఆర్టీసీ ఆధ్వర్యంలో మహిళా సిబ్బందిని సన్మానించారు. ఈ సందర్భంగా తాండూరు డీఎస్పీ బాలకృష్ణారెడ్డి మాట్లాడుతూ మహిళలు అన్నిరంగాల్లో ముందుండాలన్నారు. ప్రజాస్వామ్య బాటలో నడుస్తూ మహిళల హక్కులను సాధించుకోవాలని సూచించారు. సమాజంలో స్త్రీలపై జరుగుతున్న దాడులను అరికట్టేందుకు కఠినమైన చర్యలతో పాటు సమాజహితం కోసం అవగాహన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. మార్కెట్ కమిటీ చైర్మన్ బాల్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ మహిళలను గౌరవించాలని సూచించారు. విద్యార్థి దశనుంచే బాలికలు ధైర్యంగా ముందుకు సాగాలన్నారు. క్రమ శిక్షణతో చదువుకుని ఉన్నత స్థాయిలో ఉండాలని పేర్కొన్నారు.

మహిళలను గౌరవించాలి

బషీరాబాద్ : మహిళలను గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యతని బషీరాబాద్ ఎస్సై శంకర్ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం మహిళా హెడ్ కానిస్టేబుల్ నర్సమ్మ, మహిళా కానిస్టేబుళ్లు స్వప్న, మమతలకు శాలువాలు కప్పి, కొత్త చీరలను బహుమతిగా ఇచ్చి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళల త్యాగాలను గుర్తిస్తూ శక్తిని రెండింతలు చేసేలా ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. కార్యక్రమంలో సిబ్బంది ఉన్నారు.

తుంకిమెట్లలో..

బొంరాస్‌పేట : అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మండల పరిధిలోని తుంకిమెట్లలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ మల్లేశ్, నాయకులు గ్రామ పంచాయతీ భవనంలో వివిధ హోదాల్లో పని చేస్తున్న మహిళలను సన్మానించారు. ఈ సందర్భంగా వారు సాధించిన విజయాలను గుర్తు చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాజేశ్, అంజిల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కోట్‌పల్లిలో..

బంట్వారం : అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా కోట్‌పల్లి పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న మహిళా కానిస్టేబుళ్లను ఎస్సై ఎంఎ గఫార్ సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మహిళలు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

సన్మానించి.. మెమోంటోలు

కులకచర్ల : మండల పరిధిలో మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కులకచర్ల లోని రైతు వేదికతో పాటు ఓంకారేశ్వర స్వామి ఆలయంలో వేడుకలను నిర్వహించి మహిళా ఉద్యోగులను సన్మానించి మెమోంటాలు అందజేశారు. అంతారంలో గ్రామ సంఘం ఆధ్వర్యంలో మహిళా ఉద్యోగులను సన్మానించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ మొగులయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ బీఎస్ ఆంజనేయులు, డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి, మాజీ ఎంపీపీ సత్యహరిశ్చంద్ర, కేజీబీవీ ఎస్‌వో దేవి, ఆనందం, మహిళా ఉద్యోగులు హాజరయ్యారు.

బషీరాబాద్ : మహిళా కానిస్టేబుళ్లను సన్మానిస్తున్న ఎస్సై శంకర్

కులకచర్ల : మహిళా దినోత్సవంలో పాల్గొన్న ఉద్యోగులు, మండల ప్రజాప్రతినిధులు

తాండూరు: మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో మహిళ సిబ్బందికి సన్మానం

తాండూరు: మున్సిపల్ కార్యాలయంలో..

బంట్వారం : మహిళా కానిస్టేబుళ్లను సన్మానిస్తున్న ఎస్సై గఫార్

మాజీ మంత్రి హరీశ్‌రావును హైదారాబాద్‌లోని అయన నివాసంలో లగచర్ల గ్రామానికి చెందిన సురేశ్ మర్యాద పూర్వకంగా కలిశారు. లగచర్ల భూ పోరాటంలో కేసులకు భయపడకుండా అక్కడి ప్రజల పక్షాన పోరాటం చేసినందుకు మాజీ మంత్రి అభినందించారని సురేశ్ తెలిపారు.
- బొంరాస్‌పేట, మార్చి 8

బీఆర్ఎస్ మహిళా మండల కమిటీ ఎన్నిక

నూతన కమిటీ సభ్యులను సన్మానించిన బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు దయాకర్‌రెడ్డి

నవాబుపేట, మార్చి 8 : బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు దయాకర్ రెడ్డి ఆధ్వర్యంలో మహిళా మండల కమిటీని ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షురాలిగా రాణీగౌడ్ (లింగంపల్లి), వర్కింగ్ ప్రెసిడెంట్లుగా పుష్పలత (పులుమామిడి), అనిత (మీనాపల్లి కలాన్), ప్రధాన కార్యదర్శిగా మౌనికారెడ్డి (పులుమామిడి), ఉపాధ్యక్షురాలిగా నర్సమ్మ (నవాబుపేట), జంగమ్మ (యెల్లకొండ), కోశాధికారిగా యాదమ్మ (యెత్రాజ్‌పల్లి), కార్యదర్శులుగా అనంత (కేశవపల్లి), లక్ష్మి (మీనాపల్లి కలాన్), హన్మమ్మ (మాదారం), అధికార ప్రతినిధిగా లక్ష్మి(గేట్‌వనంపల్లి), ప్రచార కార్యదర్శిగా సత్యమ్మ (మాదారం)ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా పలువురు మహిళలు మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో హామీ లిచ్చిన కాంగ్రెస్ నేతలు అధికారంలోకి రాగానే వాటిని విస్మరించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం మహిళా కానిస్టేబుళ్లను ఎస్సై అరుణ్‌కుమార్ ఆధ్వర్యంలో సన్మానించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, నూతన కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

లోక్‌అదాలత్ ద్వారా 1631 కేసులు రాజీ

వికారాబాద్ : మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి సున్నం శ్రీనివాస్‌రెడ్డి

వికారాబాద్, మార్చి 8 : జిల్లాలో లోక్ అదాలత్ ద్వారా 1631 కేసులకు సంబంధించి ఇరు వర్గాలు రాజీ కుదుర్చుకున్నారని జిల్లా ప్రధాన న్యాయమూర్తి సున్నం శ్రీనివాస్ తెలిపారు. శనివారం జిల్లాలోని వికారాబాద్, పరిగి, తాండూరు, కొడంగల్ కోర్టుల్లో నిర్వహించిన లోక్ అదాలత్‌లో 1631 కేసులు రాజీ చేసుకున్నారని ఆయన తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అదనపు న్యాయమూర్తి చంద్రకిశోర్, జిల్లా న్యాయసేవ సెక్రటరీ న్యాయమూర్తి డీబీ శీతల్, సీనియర్ సివిల్ న్యాయమూర్తి వెంకటేశ్వర్లు, జూనియార్ సివిల్ జడ్జి న్యాయమూర్తి శ్రీకాంత్, ఎస్సీ నారాయణ రెడ్డి, బార్ ప్రెసిడెంట్ అశోక్ కుమార్, పీపీలు అన్వేషింగ్, సమీనాబేగం, న్యాయవాదులు పాల్గొన్నారు.

కొడంగల్ : పట్టణంలోని మున్సిఫ్ కోర్టులో మెగా లోక్ అదాలత్‌ను నిర్వహించి 80 కేసులను పరిష్కరించినట్లు ప్రథమశ్రేణి న్యాయమూర్తి శ్రీరాం అన్నారు. కార్యక్రమంలో లోక్ అదాలత్ సభ్యులు పాల్గొన్నారు.

49 కేసులు పరిష్కారం

బొంరాస్‌పేట : జాతీయ మెగా లోక్ అదాలత్ ద్వారా బొంరాస్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో 49 కేసులను పరిష్కరించినట్లు ఎస్సై అబ్దుల్ రాహుఫ్ తెలిపారు. కొడంగల్ మున్సిఫ్ కోర్టులో ఏర్పాటు చేసిన లోక్ అదాలత్‌లో కక్షిదారులు రాజీ పడటంతో కేసులు పరిష్కారమయ్యాయని తెలిపారు.

174 కేసులు పరిష్కారం

పరిగి : పరిగిలోని కోర్టు ఆవరణలో శనివారం జరిగిన లోక్ అదాలత్‌లో 174 కేసులను పరిష్కరించారు. జూనియర్ సివిల్ జడ్జి నాగుల శిల్ప అధ్యక్షతన లోక్ అదాలత్ జరిగింది. ఈ సందర్భంగా సీసీ ఎల్ ఎ 22, సీసీ ఎక్సైజ్ 8, సీసీ(అడ్మిన్) 14, సివిల్ ఒకటి, బ్యాంకు 9, సైబర్ క్రైమ్ 13, డీడీ 107 కేసులు పరిష్కరించారని సిబ్బంది తెలిపారు.

క్రమశిక్షణతో విధులు నిర్వహించాలి

మాట్లాడుతున్న ఎస్పీ నారాయణరెడ్డి

సమావేశానికి హాజరైన పోలీసులు

వికారాబాద్, మార్చి 8 : పోలీసులు క్రమశిక్షణతో విధులు నిర్వహించాలని ఎస్పీ నారాయణ రెడ్డి సూచించారు. శనివారం వికారాబాద్‌లోని ఎస్పీ కార్యాలయంలో ఏఆర్ పోలీస్ సిబ్బందితో దర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ఉద్యోగులు విధుల నిర్వహణలో ఎదుర్కొంటున్న సమస్యలను ఎస్పీ దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మీ సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి, ఉన్నతాధికారులతో చర్చించి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. పోలీస్ శాఖ అంటే క్రమ శిక్షణకు మారు పేరని అన్నారు. ప్రతి ఒక్కరూ క్రమశిక్షణతో విధులు నిర్వర్తించాలని, సమయపాలన పాటించాలన్నారు. పోలీసు శాఖలో గుర్తింపు పొందాలంటే ప్రతి అధికారి ఉత్తమంగా పని చేయాలన్నారు. మహిళా దినోత్సవం సందర్భంగా ఆ ఉద్యోగులకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఏఆర్ ఆర్ఎస్సైలు, ఏఆర్ఎస్సైలు, ఏఆర్ హెచ్‌సీలు, ఏఆర్ పీసీలు తదితరులు పాల్గొన్నారు.

ఢిల్లీలోని వీఎస్సార్‌లో లింగనపల్లి రైతు

ఢిల్లీలోని వీఎస్సార్‌లో మాట్లాడుతున్న రైతు కొండని రాములు

దోమ, మార్చి 8 : మండల పరిదిలోని లింగనపల్లి గ్రామానికి చెందిన కొండని రాములు అరక ఎఫ్‌పీసీ సభ్యుడిగా ఉన్నారు. ఆయన శనివారం ఢిల్లీలో నీతి అయోగ్, వాసన్, ఆర్ఆర్ఎ స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో నిర్వహించిన వలంటరీ నేషనల్ రివ్యూ (వీఎస్సార్) ప్రోగ్రాంలో పాల్గొని తెలంగాణలో రైతులకు ఉన్న సమస్యలు, వాతావరణ మార్పులను ఎదుర్కొనేందుకు ప్రకృతి వ్యవసాయం ప్రాముఖ్యతపై సభలో ప్రసంగించారు. వ్యవసాయాన్ని ప్రోత్సహించేందుకు, పంటల్లో వైవిధ్యాన్ని అందించేందుకు ప్రభుత్వం తగిన చర్యలు చేపట్టాలని రాములు కోరారు. కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

గాజీపూర్‌లో ఉచిత కంటి వైద్య శిబిరం

పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

పెద్దేముల్, మార్చి 8 : మండల పరిధిలోని గాజీపూర్‌లో హైదరాబాద్‌లోని ఎల్ఎన్ఆర్ యువసేన శంకర్ కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. శిబిరంలో 300 మందికి పరీక్షలు నిర్వహించారు. వీరిలో 50 మందికి ఆపరేషన్ కోసం శంకర్ ఆస్పత్రికి పంపించామని ఎల్ఎన్ఆర్ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో నారాయణరెడ్డి, ఎల్ఎన్ఆర్ యువసేన అధ్యక్షుడు లొంక నర్సింహులు, మండల కోఆప్షన్ మాజీ సభ్యుడు నసీరుద్దీన్, నాయకులు లాల్ రెడ్డి, ప్రకాశ్ రెడ్డి, యూత్ ప్రెసిడెంట్ మహేశ్, సంగమేశ్వర్, నాగ భూషణం, రాములు, బంగారు నర్సింహులు, రవి, రామకృష్ణ, ప్రవీణ్, రాము జాదవ్, తదితరులు పాల్గొన్నారు.

ఆరు గ్యారెంటీలను అమలు చేయాలి

యాచారం, మార్చి 8: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను సక్రమంగా అమలు చేయాలని సీఐటీయూ మండల కన్వీనర్ చందూ నాయక్ డిమాండ్ చేశారు. మంథన్‌గౌరెల్లిలో సీపీఎం ఆధ్వర్యంలో శనివారం ఇంటింటి సర్వేను నిర్వహించారు. గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అర్హులందరికీ పథకాలు అందేలా చూడాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

31లోపు ఫీజు చెల్లించి.. రాయితీ పొందండి

కొడంగల్, మార్చి 8 : ఎల్ఆర్ఎస్ కోసం 2020వ సంవత్సరంలో దరఖాస్తు చేసుకున్న ప్లాట్ల యజమానులు ఈ నెల 31లోపు పూర్తి ఫీజు చెల్లించి 25 శాతం వరకు రాయితీ పొందాలని కొడంగల్ మున్సిపల్ కమిషనర్ తెలిపారు. ఈ అవకాశాన్ని కొడంగల్ పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అంత్యక్రియలకు ఆర్థిక సహాయం

కులకచర్ల, మార్చి 8 : మండల పరిధిలోని లాల్‌సింగ్‌తండాలో పాత్లావత్ రాములు నాయక్ అనారోగ్యంతో మృతి చెందాడు. ఆయన పీఏసీఎస్‌లో సభ్యుడిగా ఉండడంతో అంత్యక్రియలకు రూ.9వేలు పీఏసీఎస్ చైర్మన్ కనకం మొగులయ్య మృతుడి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పీఏసీఎస్ సభ్యులుగా ఉన్న వారికి ఆర్థిక సహాయం అందిస్తామన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్ కొండయ్య, లాల్‌సింగ్‌తండా నాయకులు పాల్గొన్నారు.

దొంగ అరెస్ట్

కొంత నగదు రికవరీ

పెద్దేముల్, మార్చి 8 : దొంగతనం కేసులో ఓ వ్యక్తిని అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. మండల పరిధిలోని జనగాం గ్రామంలో జీనిగే వెంకట్‌రెడ్డి ఇంట్లో ఫిబ్రవరి 25న అర్ధరాత్రి దొంగతనం జరిగింది. ఇంటిలోని బీరువా తాళం పగుల గొట్టి తులం బంగారం, రూ.65వేల నగదు, పట్టు చీరలను ఎత్తుకెళ్లారు. ఈ ఘటనపై ఈ నెల ఒకటిన ఫిర్యాదు చేయగా.. శనివారం గోపాల్‌ను అదుపులోకి విచారణ చేయడంతో నేరం ఒప్పుకున్నాడని పోలీసులు తెలిపారు. కొంత నగదు రికవరీ చేసి, నిందితుడిని కోర్టులో హాజరు పర్చామని తెలిపారు.

గ్రామ సంఘాలపై సభ్యులకు అవగాహన

పెద్ద అంతారంలో నూతనంగా ఎన్నికైన సభ్యులను సన్మానిస్తున్న మహిళా సంఘాల సభ్యులు, సెర్ప్ సిబ్బంది

కులకచర్ల, మార్చి 8 : మండల పరిధిలోని అంతారం గ్రామ పంచాయతీ పెద్ద అంతారం గ్రామ మహిళా పరస్పర సహాయక సహకార పొదుపు సంఘం లిమిటెడ్‌లో జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. పెద్ద అంతారం గ్రామ సంఘం అధ్యక్షురాలు జీవిత ఆధ్వర్యంలో సర్వ సభ్య సమావేశం నిర్వహించి పలు అంశాలను చర్చించారు. ప్రతి మహిళా సంఘం నుంచి ఒక సభ్యురాలిని గ్రామ సంఘం ఆర్జీబీ సమావేశానికి పంపించాలని గత వారం రోజుల క్రితం ప్రణాళికలను తయారు చేసిన గ్రామ సంఘం ప్రతి మహిళా సంఘం నుంచి ఒకరిని ఎన్నిక చేసి తీర్మానం కాపీతో గ్రామ సంఘం సమావేశానికి తీసుకొచ్చినట్లు తెలిపారు. దీని ప్రకారం శనివారం పెద్ద అంతారంలో డ్వాక్రా భవనంలో ఏర్పాటు చేసిన ఆర్జీబీ సమావేశంలో సంఘం నుంచి వచ్చిన ప్రతినిధులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం గ్రామంలో మొత్తం 24 సంఘాలను 12 నియోజకవర్గాలుగా తయారు చేసి ఈసీ సభ్యులను ఎన్నుకున్నారు. ఈసీ సభ్యుల నుంచి గ్రామ సంఘం ఆఫీస్ బేరర్స్‌ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారివారి స్థాయిలో పదవి కాలాన్ని చీటీల ద్వారా నిర్ణయించారు. ఈ సందర్భంగా గ్రామ సంఘం అధ్యక్షురాలి ఎంపిక కోసం ఎన్నికలు నిర్వహించారు. వీరిలో 5గురు సభ్యులు అధ్యక్ష పదవికి పోటీకి రాగా ఈసీ సభ్యులతో ఎన్నికలు నిర్వహించి అధ్యక్షరాలిని ఎన్నుకున్నారు. పెద్ద అంతారం గ్రామ సంఘం అధ్యక్షురాలిగా పెరుమళ్ల పద్మమ్మ, ప్రధాన కార్యదర్శిగా గడ్డమీది లక్ష్మి, కోశాధికారిగా దేవమ్మ, ఉపాధ్యక్షురాలుగా జీవిత, సహాయ కార్యదర్శిగా జయమను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఎన్నికైన సభ్యులను, వీవోఏ లక్ష్మిని మహిళా దినోత్సవం సందర్భంగా సన్మానించారు. కార్యక్రమంలో సెర్ప్ సిబ్బంది, మహిళా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

మండల కేంద్రంలో ఐకేపీ ఆధ్వర్యంలో శనివారం ఇందిర మహిళా శక్తి స్వగృహ క్యాంటీన్‌తో పాటు పలు గ్రామాల్లో సీసీ రోడ్ల పనులను పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి ప్రారంభించారు. **- దోమ, మార్చి 8**

తెలంగాణ కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ ఎంప్లాయిస్ యూనియన్ వికారాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఇల్లూరి క్రాంతికుమార్ ఆధ్వర్యంలో శనివారం కొడంగల్‌లో సీపీఎస్‌పై అవగాహన కల్పించి కరపత్రాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు అశోక్, గురుకుల ప్రిన్సిపాల్ నగేశ్, శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు. **- కొడంగల్, మార్చి 8**

వరి గడ్డి దగ్ధం

పెద్దేముల్, మార్చి 8 :మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో శనివారం సాయంత్రం భారీ అగ్ని ప్రమాదం జరిగింది. పశువులు తినే వరిగడ్డి, వ్యవసాయ పనిముట్లు పూర్తిగా అగ్నికి ఆహుతయ్యాయి. స్థానికులు గమనించి మంటలు ఆర్పేందుకు యత్నించారు. మంటలు అదుపు కాకపోవడంతో ఫైర్ సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో వారు ఘటనా స్థలానికి చేరుకొని మంటలను ఆర్పి అదుపులోకి తెచ్చారు. ఎవరూ లేని సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు వరి కుప్పకు నిప్పంటించినట్లు బాధితుడు నర్సప్ప వెల్లడించారు. సుమారు రూ. 2లక్షల విలువైన ఆస్తి నష్టం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి నష్టపరిహారం అందించాలని బాధితుడు కోరారు.

దగ్ధమైన గడ్డి వాము